సీరియల్

అగ్ని ఖడ్గం

ప్రతాప రవిశంకర్

(గత సంచిక తరువాయి)

అరుపులు — కేకలు — ఆర్తనాదాలు....

కసికొద్దీ నరుకుతున్నారు టకారాజాతి మనుషులు. ఎవర్నీ ప్రాణాలతో బందీలను చేసే ఆలోచనే వాళ్ళకు వున్నట్టుగా తోచలేదు.

తమ కపాచీ దేవత మెళ్లో వున్న మణినే నాగరికులు కాజెయ్యబోతున్నారనేసరికి వాళ్ళ ఆగ్రహానికి అంతు లేకుండాపోయింది.

నాయకుడు ఏవో ఆజ్ఞలను జారీచేస్తున్నాడు.

తన చేతికి దొరికిన మనుషులను బల్లెంతో కసికొద్దీ పొడుస్తున్నాడు.

పులి గురించిన భయం వాళ్ళలో యే ఒక్కరికీ లేదు. దాని గురించి వాళ్ళకు బాగానే తెలుసు. అది ఆహారం కోసమే దాడిచేసింది. ఆహారం దొరకగానే దాన్ని

అక్కడినించి దాని నివాసం దగ్గరకు లాక్కు వెళు తుంది.

వాళ్ళు అనుకున్నట్టుగానే ఓ మనిషిని గొంతు పట్టుకుని ఈడ్చుకుంటూ చెట్లమధ్యనించి చీకట్లోకి పరుగుదీసింది.

చీకట్లో ఎవరు ఎవరో టకారాలకు తెలీటంలేదు. అందుకే అంతా దొరికారనే అనుకుంటున్నారు. పులి రాకుండా వున్నట్లయితే నాగరికులు అంతమందీ టకా రాలకు దొరికేవాళ్ళు కాదేమో!

• • •

వెనకనించి చావుకేకలు ముందు పరుగుదీస్తున్న భారత్‌కి—సెల్లాకు లీలగా వినపడుతున్నాయి. అప్పటికే వాళ్ళు చాలా దూరం పరుగుదీశారు. వాళ్ళ వెనకగా ఇంకెవరూ పరుగెత్తుతున్న అడుగుల చప్పుడు వినపడక పోవటంతో—

"దురదృష్టం .... అంతా ఆ నరరూప రాక్షసులకు దొరికినట్టున్నారు" అన్నాడు భారత్.

"అవును. పులి గురించి భయపడి ఆగిపోయారు. ఇంత లోనే వాళ్ళు వచ్చేశారు. చివరకు మనిద్దరమే వాళ్ళ నించి తప్పించుకు రాగలిగాం" అన్నది సెల్లా.

"చావైనా, బతుకైనా అంతా కలిసికట్టుగానే అను కున్నాం. ఐనా అలా జరగలేదు. చివరకు వాళ్ళు భయ పడినంతా జరిగింది. ప్రాణాలు పోగొట్టుకున్నారు. మిజర బుల్. ఆ టకారాలు ఒక్క మనిషిని కూడా ప్రాణా లతో వదలరు. వాళ్ళకు జాలిలేదు."

పరిగెత్తుతూనే మాట్లాడుకుంటున్నారు.

ఇంకొంచెందూరం పరుగుదీస్తే ఆ పొడుగాటి చెట్లు అంతం అయిపోతాయి.

"బుస్ ....స్ ....స్."

తక్షణ ఆగిపోయాడు భారత్ —

"స్టెల్లా....ఆగిపో" అరిచాడు రెండు చేతులను పక్కకు చాపుతూ.

వేగాన్ని కంట్రోల్ చేసుకుంటూనే వెంటనే ఆగిపోయింది స్టెల్లా — అతని చేతిదగ్గర.

ఎండుటాకులమీద కొద్ది దూరంలోనే కొరడాతో టపటప మంటూ కొడుతూన్న చప్పుడు వినపడుతోంది. అప్పటికే టకారాలకు బాగానే దూరంగా వచ్చామని అనుకున్న తర్వాత భారత్ గాస్ లైటర్ తీసి వెలిగించి అదిరిపడ్డాడు.

ఎదురుగా తక్కువ దూరంలోనే పడగవిప్పి బుసకొడుతోంది నీలిరంగు పాము. బుస కొడుతూనే తోకతో ఆకులమీద కొరడాలా కొడుతోంది.

దాన్ని చూడగానే స్టెల్లా కూడా భయం వేసింది.

దగ్గరలోనే వుంది పాము. తలమీది బుడిపె — దాంట్లో ముల్లుతో అసహ్యానిగా, భయం కలిగించేలా వుంది.

లైటర్ వెలుగుతూనే వుంది. ఆ వెలుగులో దాని కళ్ళు మెరుస్తున్నాయి. అది వాళ్ళిద్దర్నీ నిర్లక్ష్యంగా చూసింది.

"స్టెల్లా....క్విక్....ఆలస్యం చెయ్యటానికి వీల్లేదు. టకారాలు రావచ్చు. షూట్ ది స్నేక్" చిన్నగా అన్నాడు భారత్ కంగారుగా.

అంతే — విసురుగా స్టెల్లా చెయ్యి రివాల్వర్ను బయటకు లాగింది.

గాలికి కదులుతోంది లైటర్ వెలుగు.

గురిచూసి ట్రిగ్గర్ నొక్కింది సెల్లా.

"ఢాం!"

దెబ్బతో నీలిరంగు పాము పడగ చిన్నాభిన్నమై పోయింది. ఎగిరి దూరంగా పడిపోయింది.

"క్విక్ ....పరిగెత్తు .... సముద్ర తీరానికి దగ్గరలోకి వచ్చేశాం."

రివాల్వర్ పేలిన చప్పుడు టకారాలకు వినిపించ లేదు. ఎందుకంటే వాళ్ళదృష్టి చేతికి దొరికిన ఆ మనుషుల మీద నే వుంది. కసికొద్దీ ప్రాణాలు పోయిన మనుషులను కూడా ముక్కలు ముక్కలుగా నరుకుతున్నారు—వంకీ కత్తులతో. తమకు అంతా దొరికిపోయారనే అను కున్నారు. ఆ చీకట్లో యెవరెవరో గుర్తుపట్టే అవకాశం లేక.

ఓ యిద్దరు నాగరిక మనుషులు—ఆ మణిని కాజెయ్య టంలో ముఖ్యమైన వాళ్ళు తమ బల్లేలకు, వంకీ కత్తులకు దొరక్కుండా పారిపోయారని టకారాజాతి మనుషులకు తెలీలేదు.

కాగడాలు వెలిగించటానికి వీల్లేకపోవటంవల్ల చీక టిగా వుండటం కారణంగానే వాళ్ళకు ఆ విషయం తెలిసే అవకాశం లేకుండా పోయింది.

అప్పటికే ఆ ఇద్దరు సముద్రతీరానికి తెప్పలను దాచిన పొదల దగ్గరకు వెళ్ళారు.

వెళ్ళటంతోనే కొంచెం పెద్దదిగా వున్న ఓ తెప్ప మీద యిద్దరూ చేతులు వేశారు బయటకు లాగటానికి.

అంతే—వాళ్ళ వేళ్ళమీద ఒక్కసారే సూదితో గుచ్చినట్టుగా చురుక్కుమన్నది. బాధతో అరుస్తూ తెప్ప లను వదిలారు. భరించలేని బాధ కలిగింది.

గాస్ లైటర్ వెలిగించాడు భారత్.

ఆ వెలుతుర్లో—పరుగుతీస్తున్న కొన్ని ఎర్రటి తేళ్ళు కనిపించాయి.

"మైగాడ్! ఎర్ర తేళ్ళు....ఇక ఈ బాధను భరించటం అసాధ్యం. ఈ దీవుల్లో వుండే తేళ్ళ గురించి మనకు తెలీదు" అన్నది సెల్లా.

భారత్ లైటర్ ఆర్పేశాడు.

తేళ్ళు పూర్తిగా వెళ్ళిపోయాయని నిర్ధారణ చేసుకున్న తర్వాత తెప్పను పొదలోనించి బయటకు లాగారు.

కొంచెంసేపట్లో దాన్ని ఇసుకలో ఈడ్చుకుంటూ సముద్రం దగ్గరకు లాక్కెళ్ళారు. ఇద్దరికీ లాక్కెళుతుంటే వేళ్ళు మరింతగా నొప్పి పుట్టాయి. చెయ్యంతా లాగేస్తున్నట్టుగా అనిపించింది.

హోరు పెడుతోంది సముద్రం.

నక్షత్రాల వెలుగులో తెల్లగా వుంది.

తెప్పతో కొంతదూరం నీళ్ళలోకి వెళ్ళారు. చల్లటి నీళ్ళు శరీరానికి తగలగానే వణుకు పుట్టినట్లయింది.

తెప్పను వదిలి దానిమీద యెక్కి కూర్చున్నారు. సెల్లా జారి పడబోయింది. చటుక్కున భారత్ ఆమెను పట్టుకున్నాడు.

ఒకసారి అటూ యిటూ కదిలి తర్వాత నెమ్మదిగా నీటిమీద తేలుతూ సముద్రం లోపలకు వెళుతోంది తెప్ప....

తేలు కుట్టిన వేళ్ళను యిద్దరూ గట్టిగా బిగించి పట్టుకున్నారు. బాధను భరిస్తూ "కొన్ని క్షణాల క్రితం జరిగింది తల్చుకుంటే నాకు యెంతో బాధగా, విచారంగా

వుంది. మనవాళ్ళంతా ఆ మొరటు మనుషుల కత్తులకు బల్లేలకు బలై పోయారు కదా" అన్నాడు భారత్.

"అవును. నేనూ అందుకే బాధ పడుతున్నాను భారత్. ముఖ్యంగా షాక్ తిన్న ఆ లేడీని నాతో లాక్కురావాలని శతవిధాలా ప్రయత్నించాను. ఐనా సాధ్యం కాలేదు. పరిగెత్తలేనని మొండికెత్తింది. కింద పడిపోయింది. ఇంతలోనే మనవాళ్ళే ఆమెను తొక్కుకుంటూ వెళ్ళిపోయారు. వెనకనించి టకారాలు దగ్గరకు వచ్చేశారు. అందుకే నా ప్రాణాలను రక్షించుకోటానికి ఆమెను వదిలిరాక తప్పలేదు" స్టెల్లా అంది విచారంగా.

"చివరకు మనిద్దరమే మిగిలాం.... యెప్పటికప్పుడు కరోన్ శాపం నిజమవుతుందేమోనని ఎంతగానో భయ పడుతూ వచ్చాను. కాని ఆశ్చర్యం! ప్రతిసారీ చావు మనల్ని వదిలి యింకొకర్ని వెతుక్కుంటూ వెళ్ళి పోయింది."

"ఆ డర్టీ కరోన్ గురించి నువ్వు యింకా మరచి పోలేదా? కరోన్ శాపం యేమిటి? మనుషులు చావ బోయే ముందు అనే మాటలన్నీ నిజమవుతాయా? నీవన్నీ ఫూలిష్ సెంటిమెంట్స్.... నే నెప్పుడూ యిలా అనుకో లేదు" అన్నది కోపంగా స్టెల్లా.

అప్పటికి తెప్ప తీరాన్ని వదిలి కొంత దూరం వచ్చే సింది.

టకారా దీవి క్రమంగా దూరమవుతోంది. ఆ జాతి మనుషులు తీరంకేసి వస్తున్న జాడలేవీ కనిపించలేదు. తేలిగ్గా గాలి పీల్చుకున్నారు భారత్ — స్టెల్లా.

మిగిలినవాళ్ళు కూడా అలాగే రాగలిగివుంటే బావుం డేది అనుకున్నారు.

తేళ్ళు కుట్టిన బాధ నిముష నిముషానికీ ఇద్దరికీ కాగా పెరిగిపోయింది. దాన్ని ఓర్చుకోవటం కష్టంగానే వుంది. ఐనా భరించక తప్పదనుకున్నారు.

భారత్ — స్టెల్లాతో ఇలా అన్నాడు:

"నాకు ఒక్కటే విషయం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ రాత్రికి మనం కపాచీదేవత మెళ్ళోవున్న మణిని కాజెయ్యటానికి పథకం వేశామని టకారా జాతిమనుషులకు ఎలా తెలిసింది? యెవరు చెప్పి వుంటారు?"

స్టెల్లా అన్నది: "నా ముక్కుపుటాలకు ఆ వెగటు వాసన తగలటంతోనే ఉలిక్కిపడ్డాను — వెంటనే తెలిసిపోయింది టకారా జాతివాళ్ళు మన దగ్గరలోనే వున్నారని. వాళ్ళకు మన గురించి యెలా తెలిసిందో నాకూ అర్థంకాలేదు. అయితే నా అనుమానం చటుక్కున ఆండ్రూస్ మీదకు వెళ్ళింది."

"యూ ఆర్ రైట్! నా దృష్టిలో కూడా ఆండ్రూస్ మన పథకం గురించి వాళ్ళకు చెప్పివుంటాడని. లేకపోతే యెలాంటి పరిస్థితులలోనూ తెలిసే అవకాశం లేదు. ఆండ్రూస్ మన గురించి, మన పథకం గురించి చెప్పి వుండకపోతే అమావాస్య రాత్రి కపాచీదేవత దీవిలో సంచరిస్తుందని తెలిసి కూడా వాళ్ళు బయటకు యెందుకు వస్తారు? కాబట్టి, వాళ్ళకు ఆండ్రూస్ అంతా చెప్పివుంటాడు."

"నిజమే భారత్....ఆండ్రూస్‌ను తప్పించి మరో మనిషి ఎవరికీ వాళ్ళతో ఈ విషయాన్ని చెప్పే అవకాశం లేదు. ఎందుకంటే మనవాళ్ళెవరికీ టకారా భాష రాదు. వచ్చినా చెప్పరు. అది తమకే ప్రమాదమని తెలుసు. కాబట్టి, ఒక్క ఆండ్రూస్‌కే మన పథకం

గురించి వాళ్ళతో చెప్పే అవకాశం వుంది. ఐనా మనతో చేతులు కలిపినట్టునటించి, తనకీ టకారాలమీద శత్రుత్వం వుందనీ ఆ మణిని కాజేసి టకారాలను కోలుకోలేని దెబ్బను కొట్టమనీ ఎందుకు చెప్పినట్టు?"

నవ్వాడు భారత్.

ఈ సంఘటనతో ఆండ్రూస్ మన సత్త్వం ఏమిటో అర్థమైపోయింది. ఆయనొక శాడిస్టు. జీవచ్ఛవంలా ఈ దీవిలో బతుకుతున్న ఆండ్రూస్‌కు ప్రాణాలతో ఇక ఈ దీవినించి బయటపడి తన భార్య, పిల్లలను కలుసుకోవటం అసాధ్యమనే ఆలోచన ఒకటి వుంది. ఈ దీవిలో ఆ టకారాజాతి మొరటు మనుషుల మధ్యత నొక్కడే నాగరికుడు. ఆయనలాగే విధివశాత్తూ మనంకూడా ఈ దీవికి వచ్చి పడ్డాము. ఇక్కడనించి బయటకు వెళ్ళటానికి మార్గం చెప్పమని ఆండ్రూస్‌ను అడిగాము. కాని ఆయన మార్గమే లేదన్నాడు. అందుకు కారణం యేమిటంటే మనం ఈ దీవి వదిలి వెళ్ళిపోవటం ఆయనకు యిష్టంలేదు.

అట్లాగని మనం ఈ దీవిలోనే శాశ్వతంగా వుండిపోవటం కూడా ఇష్టంలేదు. ఉంటే కొన్నాళ్ళకు మనం కూడా టకారాల భాష నేర్చుకొని నాయకుడి అనుగ్రహం సంపాదిస్తే నాయకుడి దగ్గర తన ఆధిక్యత నశించిపోవచ్చు. ఎందుకంటే ఆండ్రూస్‌కు నాయకుడి దగ్గర కొంచెం పరపతి వుంది. ఆయనకు తన పక్కనే ఒక సింహాసనం వేయించటంలోనే ఆ విషయం తెలిసిపోయింది. దీన్ని ఆసరాగా తీసుకుని ఆలోచిస్తే ఆండ్రూస్ ప్రాయశ్చిత్తం విషయంలో మనకు కావాలనే ద్రోహం చేశాడు. నాయకుడికి టకారా భాషలో పాంకీలో

శవాన్ని పాతిపెట్టటం గురించి ఏం చెప్పాడో మనకు తెలీదు. ఇప్పుడు ఇక ఆండ్రూస్ ఉద్దేశం మనల్ని ఆ దీవిలోనే టారాతాలతో చంపించటం.

ఆండ్రూస్ మార్గంలేదని చెప్పినా మనం ఇక్కడి నించి బయటపడటానికి ప్రయత్నాలు చేస్తామని తెలుసు. అందుకే మనకు పగతీర్చుకోటానికన్నట్టు ఈ పథకం చెప్పాడు. తీరా మనం ఆ ప్రయత్నంలో వున్నప్పుడు మన గురించి నాయకుడికీ మిగిలిన వాళ్ళకీ తెలియబరిచాడు. నీచుడు. ఇంతకీ ఆ కోట్లరూపాయల విలువచేసే ఆ మణిని స్వాధీనపరచుకోకముందే వీళ్ళు వచ్చారు. పథకం అంతా చెడిపోయింది. ఐనా— జీవించి వుంటే యెలాగైనా ఆ దివ్యమైన మణిని సంపాదించి తీరాలి. అదే నా జీవిత ధ్యేయం" అన్నాడు భారత్....

"డర్టీ డెవిల్ ఆండ్రూస్. ఇంతకీ ఈ తెప్ప యెటు వైపుకు వెళుతుందో, మనం ఎక్కడికి చేరుకుంటామో... తెలీటంలేదు" అన్నది స్టెల్లా కళ్ళు మూసుకుంటూ.

"నిద్ర వస్తోందా?" అడిగాడు భారత్. అతనికీ అప్రయత్నంగానే కళ్ళు మూసుకు పోతున్నాయి.

"నిద్ర కాదనుకుంటాను. వళ్ళంతా యేదోలా వుంది. తేలు విషం శరీరంలోకి యెక్కుతుందేమో! మత్తుగా వుంది" బాధపడుతూనే అన్నది మరింతగా కళ్ళు మూసుకుంటూ.

అప్పటికే తెప్ప తీరాన్ని వదిలి సముద్రంలో చాలా దూరం వచ్చేసింది.

భారత్ కళ్ళు తెరవాలని ప్రయత్నించాడు. కాని సాధ్యం కాలేదు. తేలు విషం శరీరంలోకి ఎక్కుతోంది.

ఎక్కడో తేలిపోతున్నట్టుగానే వుంది.

ఇంకొంచెం సేపట్లోనే ఇద్దరికీ స్పృహ తప్పింది. ఒకరిమీద ఒకరు పడిపోయారు.

తెప్ప నీళ్ళమీద తేలుతూ ప్రయాణం చేస్తోంది. అప్పటికి టకారా దీవిలో సందడి సద్దు మణగలేదు.

*　　　*　　　*

సెల్లా కంటే ముందు భారత్ కే స్పృహ వచ్చింది. కళ్ళు తెరిచాడు. ఒక్క క్షణం అతడికేమీ వెంటనే అర్థం కాలేదు. కాని—తర్వాత ఉలికిపడుతూ బెడ్ మీద లేచి కూర్చోబోయాడు.

అతడికి వెంటనే చిన్న నవ్వు వినపడింది. భారత్ పక్కనే ఓ యాభై యేళ్ళ మనిషి కుర్చీలో కూర్చున్నాడు.

"గుడ్. మెలకువ వచ్చిందన్నమాట" అన్నాడు సిగరెట్టు వెలిగించుకుంటూ—

"ఇప్పుడు నేనెక్కడ వున్నాను?"

అలా అడుగుతూనే పక్కకు చూశాడు. పక్కనే వున్న బెడ్ మీద సెల్లా నిద్రపోతోంది.

"సురక్షితమైన ప్రదేశంలోనే వున్నావు....హాసీనా అనే ఓడలో వున్నావు" అన్నాడాయన పొగ వదులుతూ.

"ఇక్కడికి మేమెలా వచ్చాం?"

"మీరు రాలేదు. సముద్రంలో స్పృహలేని స్థితిలో ఒక తెప్పమీద పడి కొట్టుకు వెళుతుంటే చూసి ఇందులోకి చేర్చాం."

"థాంక్ గాడ్" అనుకున్నాడు భారత్.

తమని రక్షించినందుకు ఆయనకు మరీ మరీ కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు.

ఆయన నవ్వి "నిజంగా మీరు మాకు కనపడటం మీ

అదృష్టమే. లేకపోతే ఈ అనంతమైన సముద్రంలో మీరు యే వైపుకు కొట్టుకుపోయే వాళ్ళో తెలీదు" అన్నాడు.

"ఇంతకీ ఈ ఓడ యే దేశానికి వెళుతోంది" భారత్ ఆత్రంగా అడిగాడు.

"భారత దేశానికి వెళుతోంది."

భారత్ సంతోషానికి అవధులు లేవు.... అతడి సంతోషాన్ని ఆయనకు యెలా వ్యక్తపరచాలో అర్థం కాలేదు.

"నిజంగా మీరు మా పాలిట దేవుడు. ఎన్ని జన్మలెత్తినా మేము మీ రుణం తీర్చుకోలేం."

మళ్ళీ నవ్వాడాయన.

నవ్వి "ఇటువంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతూ వుంటాయి. ఇంతకీ మీరెవరు? సముద్రంలో ఆ తెప్పమీద మీరు యెక్కడినించి వస్తున్నారు?" అనడిగాడు.

కంపూచియాలో ప్లేన్ యెక్కిన దగ్గర్నించీ చివరి వరకూ జరిగినదంతా ఆయనతో చెప్పాడు భారత్. ఐతే టకార దీవిలో కపాచీ దేవత హారంలో వున్న విలువైన మణి గురించి ఆయనతో చెప్పలేదు. తామంతా పారిపోయి వస్తుంటే టకారాలు వెంటపడి మిగిలిన వాళ్ళందరినీ హతమార్చారని చెప్పాడు.

భారత్ చెప్పిన కథ విని ఆయన చలించిపోయాడు.

"వాళ్ళంతా అలా హతమైపోవటం విచారకరం. మీరిద్దరూ గొప్ప అదృష్టవంతులు. ప్రాణాలతో బయటపడ్డారు నిజమే. ఈ దీవుల్లో వుండే అనాగరికుల ఆచారాలు—నమ్మకాలు చాలా దారుణంగా వుంటాయి."

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ వున్నప్పుడు స్టెల్లాకు కూడా స్పృహ వచ్చింది. ఆమె కూడా మొదట్లో కళ్ళు తెరవగానే ఆశ్చర్యపోయింది.

ఆమె బెడ్ మీద లేచి కూర్చున్న తర్వాత భారత్ ఆమెకు జరిగిందంతా చెప్పాడు—ఆయన్ని ఆమెకు పరిచయం చేసి.

స్టెల్లా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసుకుంది.

ఓడలో పనిచేసే మరి కొంతమంది ఉద్యోగులు ఆ గదిలోకి వచ్చారు. భారత్—స్టెల్లాల కథ విని ఆశ్చర్యపడ్డారు.

టకారా దీవి గురించి వాళ్ళు అసలు వినలేదని చెప్పారు భారత్ అడిగిన తర్వాత.

మృత్యుముఖం నుంచి ప్రాణాలతో బయటపడినందుకు ఆ ఇద్దరినీ వాళ్ళంతా అభినందించారు. తమని ఓడలోకి చేరవేసినందుకు ఆ ఇద్దరూ వాళ్ళందరికీ కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

స్టెల్లా అందం వాళ్ళందరినీ బాగా ఆకర్షించింది. వాళ్ళు యొక్క వసేవు ఆమెతో మాట్లాడటానికి ఆసక్తిని చూపడం భారత్ గమనించి నవ్వుకున్నాడు.

భారత్ ఆయన్నడిగి ఇండియా చేరటానికి ఇంకో రోజు పడుతుందని తెలుసుకున్నాడు. అది రాత్రి అనీ ఇంకో రెండు గంటల్లో తెల్లారబోతుందనీ తెలిసింది. అంటే యిద్దరూ దాదాపుగా ఒకరోజంతా స్పృహ లేకుండా గడిపారన్నమాట.

ఒక్క రోజులో ఆ తెప్పమీద సముద్రంలో యెంత దూరం ప్రయాణంచేసి వుంటారు? ఏమో తెలీదు. ఆయన్ని

అడిగాడు.

"మీరు ప్రవాహానికి వాలుగా ప్రయాణం చేశారు కాబట్టి చాలా దూరం వచ్చి వుంటారు."

"భారతదేశం ఇక్కడికి యింకా యెంతదూరంలో వుంది" వెయ్యి కిలోమీటర్ల పైనే ఉండొచ్చునని చెప్పాడాయన.

ఇంకా దీవుల గురించిన అనేక విషయాల గురించి ఆయన్ని అడిగాడు భారత్....ఆయన అన్ని ప్రశ్నలకీ యెంతో ఓపికగా జవాబులు ఇచ్చాడు.

భారత్ కోరికమీద చివరగా దీవుల గురించి పరిశోధన చేసిన ఓ ప్రొఫెసర్ గురించి చెప్పాడు.

ఆయనే ప్రొఫెసర్ బలదేవ. ఆయన మద్రాసులో ఉంటున్నారు. మద్రాసు వెళ్ళగానే ఆయన్ని కలుసుకోవాలనుకున్నాడు భారత్.

భారత్ ఈ వివరాలన్నీ యెందుకు అడుగుతున్నాడో స్టెల్లా గ్రహించింది—టకారా దీవిలో వున్న కపాచీ దేవత హారంలో వున్న కోట్లు విలువచేసే మణి గురించే—

మళ్ళీ ఆ మృత్యు దీవికి వెళ్ళటం గురించి భారత్ ఇప్పుడే ఆలోచనలు చేస్తున్నాడా?

ఉలిక్కిపడింది స్టెల్లా.

అక్కడ అనుభవించిన నరకమంతా కళ్ళముందు గిర్రున తిరుగుతోంది.

"భారత్" పిల్చిందతన్ని.

అతను పలకలేదు. ఆలోచిస్తూ వుండిపోయాడు. అతని ఆలోచనలన్నీ ఆ మణి గురించే—తప్పదు. తన జీవిత ధ్యేయం ఒక్కటే—టకారాల మణిని సంపాదించాలి.

కొంచెంసేపట్లో తెల్లవారబోతున్నదని చెప్పాడాయన చేతికున్న వాచీ చూసుకుని.

* * *

మద్రాసు—

'భారత్ నిలయం' లోనించి అంబాసిడర్ కారు బయటకు వచ్చింది.

రోడ్డుమీద రివ్వున దూసుకు వెళ్ళింది. అందులో భారత్ అతని తమ్ముడు రంజిత్ — స్టెల్లా కూర్చుని ఉన్నారు.

రంజిత్ కారును డ్రయివ్ చేస్తున్నాడు. అతడి నోట్లో సిగరెట్టు వెలుగుతోంది.

భారత్‌ను ఆనుకొని కూర్చుంది స్టెల్లా.

"మళ్ళీ ఇలా నాగరిక ప్రపంచాన్ని చూస్తామని యే మాత్రం వూహించలేదు. అదంతా ఓ పీడకలగా గడిచి పోయింది" అన్నాడు భారత్ దాటిపోతున్న ఎత్తయిన భవనాలను—పరుగులు దీస్తున్న వాహనాలను, షాపులను జనసందోహాన్ని చూస్తూ.

నవ్వింది స్టెల్లా.

"కాని మనిషి తల్చుకుంటే సాధ్యంకానిది యేదీ లేదనిపిస్తోంది నాకు. ఆండ్రూస్ మనందరికీ ద్రోహం చెయ్యకుండా వున్నట్లయితే మిగిలిన వాళ్ళు కూడా ఆ దీవినించి మనలాగే బయటపడేవాళ్ళు. కాని బాడ్ లక్. టకారాల క్రూరత్వానికి బలై పోయారు"

"అవును స్టెల్లా నిజంగా దురదృష్టమే. ఆండ్రూస్ మనకు తీరని అన్యాయం చేశాడు. తన శాడిజంతో యెంతోమంది నాగరికుల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నాడు."

కారు వేగంగా వెళుతోంది.

రంజిత్ ఎంతో తాపీగా సిగరెట్టు కాలుస్తూ కారును డ్రయివ్ చేస్తున్నాడు. మైలాపూర్‌లోనించి వెళుతోంది కారు.

మద్రాసు నగర అంద చందాలను చూస్తోంది సెల్లా. మొత్తానికి భారతదేశం రావాలనే తన కోరిక తీర కుండానే ఆ టకారా దీవిలోనే తన జీవితం అంతమయి పోతుందేమోనని భయపడింది. కాని తన అదృష్టం, ఆ బందిఖానానించి భారత్‌తోనే బయటపడింది. భారత దేశం చేరుకోగల్గింది.

రంజిత్—ఆ ఇద్దరి మాటలు వింటున్నాడు. రంజిత్-భారత్‌కి సొంత తమ్ముడు కాదు. బాబాయి కొడుకు. చిన్నతనంనించీ భారత్‌తోనే కలిసి పెరిగాడు. ఇద్దరికీ వయసులో ఒకే ఒక్క యేడాది తేడా వుంది. భారత్ అతనికంటే పెద్ద.

భారత్ సూచనల ప్రకారం కారు ఓ పెద్ద భవనం ముందు ఆగింది.

రెండంతస్తుల భవనం. ముందు పెద్ద ఇనుపగేటు. అక్కడే గూర్ఖా కూర్చుని వున్నాడు. కారును చూడ గానే గేటు తెరిచాడు.

లోపలకు వెళ్ళింది కారు.

బాటకిరువైపులా రంగు రంగుల పువ్వుల మొక్కలు వున్నాయి.

పోర్టికోలో అంబాసిడర్ ఆగింది.

అందులోనించి ముగ్గురూ దిగారు.

లోపలకు నడిచారు.

నడవలో ఎవ్వరూ కనపడలేదు. విజటర్స్ రూములోకి

వెళ్ళి కూర్చున్నారు.

భారత్ అటుగా వచ్చిన నౌకర్ని పిలిచి యేదో చెప్పాడు. వాడు పైకి వెళ్ళి ఐదు నిమిషాల తర్వాత తిరిగివచ్చి ప్రొఫెసర్ బలదేవ వాళ్ళందరినీ పైకి రమ్మంటున్నాడని చెప్పాడు.

ముగ్గురూ పైకి వెళ్ళారు.

గది తలుపులు నెట్టుకొని లోపలకు అడుగుపెట్టారు.

ఎదురుగా—

కుర్చీలో అరవై యేళ్ళాయన కూర్చుని వున్నాడు. తెల్లగా వున్నాడు. ముడతలుపడిన శరీరం. కళ్ళు లోపలకు పీక్కుపోయాయి. పొడుగ్గా ఉన్న ముక్కు—తెల్లని బట్టలు ధరించాడు. జుట్టు పూర్తిగా నెరిసిపోయింది. పొట్టిగా కత్తిరించినట్టున్న నెరిసిపోయిన గడ్డం.

తనని పరిచయం చేసుకొని స్టెల్లానూ—రంజిత్‌నీ బలదేవకు పరిచయం చేశాడు.

ఓ గంట క్రితమే భారత్—బలదేవకు ఫోన్ చేసి అపాయింట్‌మెంట్ ఫిక్స్ చేసుకున్నాడు.

ప్రొఫెసర్‌ని చూడటంతో నే నిరుత్సాహపడిపోయాడు భారత్. ఆయన శరీరమంతా ముడతలు పడిపోయి మరీ అంత ముసలివాడిగా కనపడతాడని అనుకోలేదు.

"చెప్పండి .... మీరు యే విషయమై నన్ను కలుసుకోవాలని అనుకున్నారు?" చిరునవ్వుతో అడిగాడు బలదేవ.

అప్పుడే ఓ స్త్రీ ట్రేలో హార్లిక్స్ కప్పులను తీసుకువచ్చి వారిముందు వుంచింది.

"తీసుకోండి" అన్నాడాయన.

హార్లిక్స్ సిప్ చేస్తూ అన్నాడు భారత్ —

"మీరు దీవుల గురించి పరిశోధనలు చేశారని విన్నాను. టకారా దీవి గురించి తెలుసుకుందామని మిమ్మల్ని కలుసుకున్నాను."

బలదేవ ముఖం చూస్తూనే ఆయనకు ఆ దీవి గురించి తెలీదని, దాని పేరు కూడా యెప్పుడూ వినలేదని గ్రహించాడు భారత్.

"సారీ....టకారా దీవి గురించి నేను ఇంతవరకూ వినలేదు. ఇదే మొదటిసారి ఆ పేరు వినటం" అన్నాడు.

భారత్ కప్పును తిరిగి ట్రేలో వుంచుతూ "స్మోక్ చేయవచ్చా?" అనడిగాడు.

తల వూపాడు బలదేవ.

రంజిత్—భారత్ సిగరెట్లు ముట్టించారు. ప్రొఫెసర్ కూడా సిగరెట్టు వెలిగించాడు.

శైలా ఆ గదిలో ఓ మూలగా రేక్‌లలో వున్న రంగు రంగుల బొమ్మలను చూస్తోంది.

"ముఖ్యంగా మీకు టకారా దీవి గురించి తెలిసి వుంటుందని అనుకుని వచ్చాను" మళ్ళీ అన్నాడు భారత్.

"ఇంతకీ మీకు ఆ దీవితో సంబంధం యేమిటి? ఎందుకు మీరు ఆ టకారా దీవి గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నారు?" ప్రొఫెసర్ అడిగాడు.

"చెబుతాను. ఆ విషయం చెప్పటానికి ముందు జరిగిన కథంతా చెప్పాలి మీకు" అని జరిగినదంతా ప్రొఫెసర్‌తో చెప్పాడు.

అంతా విని ఆయన "రియల్లీ యు ఆర్ లక్కీ.... అలాంటి దీవినుండి, ఆ మనుషుల నుంచీ బయటపడగలిగారంటే మీరు గొప్ప సాహసం చేశారు. ఇంతకీ మీరు మళ్ళీ ఆ దీవి గురించి తెలుసుకోవాలని యెందుకు అను

కుంటున్నారు? ఆ దీవి గురించి నా కంటే మీకు అన్ని విషయాలూ తెలుసు కదా? ఇక ఆ దీవితో పనేమిటి?" అనడిగాడు.

భారత్ నవ్వాడు.

"టకారా దీవినుంచి బయట పడటం వరకు మమ్మల్ని అదృష్టం వెంటాడింది. కాని ఏం లాభం? ఒక్క విషయంలోనే నన్ను దురదృష్టం వెంటాడింది. అందుకే మళ్ళీ నేను ఆ ప్రమాదాలతో నిండి వున్న టకారా దీవికి వెళ్ళక తప్పదు."

"ఎందుకు?"

భారత్ ఆ మణి గురించి ప్రొఫెసర్‌తో చెప్పదలుచుకున్నాడా?...అనుకుంది స్టెల్లా.

కాని ఆమె ఆలోచనను తలక్రిందులు చేస్తూ-"చెప్పాను కదా! నేను వజ్రాల వ్యాపారిని. ప్రపంచంలో వున్న మేలురకం వజ్రాలను సంపాదించి బిజినెస్ చేస్తూ వుంటాను. అలాగే కంపూచియానించి లక్షలు విలువచేసే వజ్రాలతో బయల్దేరాను. వాటిని టకారా దీవిలోనే వదిలి వచ్చేశాను ఆ రాత్రి. దీవి వదిలి వచ్చిన తర్వాత గుర్తుకు వచ్చింది. ఇప్పుడు ఆ వజ్రాలకోసం మళ్ళా ఆ దీవికి వెళ్ళక తప్పదు" అని చెప్పాడు.

మనసులోనే నవ్వుకుంది స్టెల్లా—

బలదేవ అంతా విని "లక్షల విలువచేసే ఆ వజ్రాలకోసం తిరిగి అపాయాలతో నిండివున్న ఆ మృత్యు దీవిలోకి మళ్ళీ అడుగు పెట్టాలని అనుకుంటున్నారా? మీ ప్రాణాలతో మీరే చెలగాటమాడటానికి సిద్ధపడుతున్నారా?" అన్నాడు.

"అవును. ఒకోసారి ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొని

ఆ దీవినించి బయటపడిన తర్వాత సాహసాలు చెయ్యాలనే కోరిక నాలో బలంగా కలుగుతోంది. ప్రాణం గురించిన భయం నాలో లేదు. అందువల్లనే నేను తిరిగి ఆ దీవికి వెళ్ళాలని అనుకుంటున్నాను. లక్షల విలువైన ఆ మేలురకం వజ్రాలను ఆ దీవిలో వదలదల్చుకోలేను."

ప్రొఫెసర్ కు భారత్ మన స్తత్వం చాలా చిత్రమైనదిగా అనిపించింది. కేవలం లక్షలు విలువచేసే వజ్రాలకోసం ప్రాణాలకు తెగించి అన్ని కష్టాలను అనుభవించిన ఆ దీవికి వెళ్ళాలని అనుకుంటున్నాడా?

ఏమిటీ మనిషి?

"మిమ్మల్ని చూస్తుంటే నాకు ఆశ్చర్యంగా వుంది. కాని ఒక్క విషయం — మీరు ఆ దీవినించి బయటపడటానికి చేసే ప్రయత్నం సాహసమనిపించుకుంటుంది కాని తిరిగి కేవలం గాజు ముక్కల్లాంటి వజ్రాలకోసం తిరిగి ఆ దీవిలోకి అడుగుపెట్టాలనుకోవటం దుస్సాహసమే అవుతుందనుకుంటాను. బాగా ఆలోచించండి. ఆ వజ్రాలు విలువైనవే కావచ్చు. కానీ మీరు తల్చుకుంటే అంతకంటే విలువైన వజ్రాలను సంపాదించలేరా?" అవడిగాడు.

"సంపాదించగలను. కాని అంత ఖరీదైన ఆ వజ్రాలను వాటి విలువ తెలియని ఆ మొరటు మనుషులు నివసించే దీవిలో ఎందుకు వదలాలి? ఐతే నా మనసులో ఒక ఆలోచన వుంది. ఆ దీవి ఎక్కడ వుందో క్లియర్ గా తెలిస్తే యెక్కువ శ్రమపడకుండా ఆ దీవికి హెలికాప్టర్ లో చేరుకోవచ్చు. ఆ దీవికి వెళ్ళిన తర్వాత రహస్యంగా ప్రయత్నించి ఆ వజ్రాలను తిరిగి పొంద

వచ్చు. అందుకోసమే నాకు ఆ టకారా దీవి సరిగ్గా యెక్కడ వున్నదో చెప్పగల మనిషి కావాలి. అందుకే నేను మిమ్మల్ని కలుసుకున్నాను."

రంజిత్ మరో సిగరెట్ వెలిగించాడు. అతనికి ఎక్కువసేపు అక్కడ కూర్చోవటం అసహ్యంగా వుంది. ఇక ఎంత సంభాషణ జరిగినా ప్రొఫెసర్ బలదేవకు టకారా దీవి గురించి తెలియనప్పుడు ఆయనతో యెక్కువ సమయం గడపటం వృధా—

ఇదీ రంజిత్ ఉద్దేశం.

"మీ నిర్ణయంలో మార్పు వుండదా?" ప్రొఫెసర్ అడిగాడు.

నవ్వాడు భారత్ ....నవ్వుతూనే "నా నిర్ణయం అంత సులభంగా మారేదికాదు ప్రొఫెసర్, నేను చాలా మొండివాడ్ని..టకారా దీవికి వెళ్ళక తప్పదు. దయచేసి ఆ దీవి గురించి తెలియజేయగల మనిషి ఎవరైనా వుంటే మాకు సూచించండి" అన్నాడు.

బలదేవ రెండు నిముషాలు ఏదో ఆలోచించాడు.

తర్వాత ఏదో గుర్తుకు వచ్చి "యు ఆర్ లక్కీ.... ప్రొఫెసర్ అనంత్ ఇంకా సిటీలోనే వున్నాడు. ఇంకో రెండు నెలల్లో అతను స్టేట్స్‌కు వెళ్ళాలని అనుకున్నాడు. అతనుకూడా ఈ మధ్య నాలాగే కొన్ని దీవుల గురించి పరిశోధనచేసి కొత్త దీవులను కొన్నింటిని కనుగొన్నట్టు ఓసారి నాతో చెప్పాడు. అప్పట్లో నా ఆరోగ్యం అంత సరిగా వుండకపోవటంవల్ల నేను ఆ విషయంలో ఎక్కువ ఇంట్రస్టు చూపలేకపోయాను. నా అంచనా నిజమయితే అనంత్ మీకు కావలసిన ఇన్ఫర్మేషన్ ఇవ్వగలడను కుంటాను. అతన్ని కలుసుకోండి" అంటూ ఓ చిన్న

డైరీతీసి అందులో కొన్ని పేజీలు తిప్పి ప్రొఫెసర్ అనంత్ అడ్రసు చెప్పాడు.

భారత్ ముహం తిరిగి వికసించింది.

"థాంక్ యూ ప్రొఫెసర్ ....అనంత్‌ను ఇప్పుడే కలుసుకుంటాను. మరోసారి కలుస్తాం.... వెళ్ళొస్తాం" అని బలదేవకు మరీ మరీ కృతజ్ఞతలు తెలియచేసుకుని బయటకు వచ్చాడు.

తిరిగి ముగ్గురూ కార్లో బయలుదేరారు.

• • •

సరిగ్గా పదినిమిషాల తర్వాత కారు ప్రొఫెసర్ అనంత్ భవనం ముందాగింది.

బయట నే బోర్డు కనపడింది.

భారత్ తన విజిటింగ్ కార్డును జవానుకు ఇచ్చాడు.

జవాను కొంచెం సేపటి తర్వాత వచ్చి వాళ్ళను లోపలకు తీసుకు వెళ్ళాడు.

ప్రొఫెసర్ అనంత్ ప్రైవేటు రూంలో కూర్చుని వున్నాడు. అతన్ని చూడటంతోనే భారత్‌తోపాటు స్టెల్లా—రంజిత్ కూడా ఆశ్చర్యపోయారు.

అతనికి ముప్పయ్ అయిదేళ్ళకు మించి వుండవు. హీరో పర్సనాలిటీ. చూడగానే యెదుటి మనుషులను ఆకట్టుకునేలా వున్నాడు. బలంగా — దృఢంగా వున్నాడు.

చిరునవ్వుతో అందరినీ ఆహ్వానించాడు.

అతిడి దృష్టిని తొలిచూపులోనే స్టెల్లా అమితంగా ఆకర్షించింది.

ప్రొఫెసర్ బలదేవను కలిసి వస్తున్నట్టుగా చెప్పాడు భారత్ ....

"ఆయన నాకు గురువులాంటి మనిషి....ఆయన్ని చూసిన తర్వాత నే నాకు దీవులగురించి పరిశోధనలు జర పాలని, కొత్త దీవులను తెలుసుకోవాలని అనిపించింది" అన్నాడు అనంత్.

భారత్ తను అనంత్‌ను కలుసుకోవటానికి వచ్చిన కారణాన్ని వివరంగా చెప్పాడు.

అంతా విని ఆనందంతో నోరు తెరిచాడు అనంత్.

"మొగాడ్....టకారాదీవిలో మీరు ఏడురోజులు గడి పారా? ఆ దీవి పేరును నేను ఒకటి రెండుసార్లు విన్నాను. ఆ దీవి దాదాపుగా ఏ ప్రాంతంలో వున్నదో నాకు తెలుసు. ఎగ్జాక్ట్‌గా ఎక్కడ వున్నదో నాకు తెలీదు. కాని కొంత ప్రయత్నించే స్తే దాన్ని మనం తెలుసుకోగలమనే నమ్మకం నాకు వుంది. ఎందుకంటే ఒకసారి మీరు ఆ దీవినంతా క్షుణ్ణంగా తిరిగి వచ్చారు కాబట్టి దాన్ని మీరు సులభంగానే గుర్తించగలరు."

ఆ మాటలు భారత్‌కీ, స్టెల్లాకు, రంజిత్‌కీ సంతో షాన్ని కలిగించాయి. ముఖ్యంగా అనంత్ చూపుతున్న ఉత్సాహాన్ని వాళ్ళు అభినందించారు మనసులో నే.

"థాంక్‌యూ మిస్టర్ అనంత్.... నేను ఆ టకారా దీవికి తిరిగి ఎందుకు వెళ్ళాలనుకుంటున్నానో మీకు చెప్పాను కదా! మీరు మాతో ఆ దీవికి రావటానికి అంగీకరి స్తే మనం ఈ టకారా దీవి ప్రయాణం గురించిన అన్ని విషయాలను చర్చించుకోవచ్చు...మీ అంగీకా రాన్ని తెలియజేయండి" అని అడిగాడు భారత్.

వెంట నే అనంత్ మాట్లాడలేదు.

తర్వాత అతను సిగరెట్టు వెలిగించి ఏదో మాట్లాడ బోయేంతలో బల్లమీద వున్న టెలిఫోన్ మోగింది,

రిసీవర్ ఎత్తి "హల్లో" అన్నాడు.

అవతలి వైపునించి వినిపించిన కోమల కంఠాన్ని వినగానే అతడి ముఖం మరింత వికసించింది. నవ్వుతూ రెండు నిముషాలు మాట్లాడి "తర్వాత ఫోన్ చేస్తాను" అని పెట్టేశాడు.

అతడి మొహంలోని వెలుగును గమనించి ఆ ఫోన్ చేసిన యువతి అనంత్‌కు ఏమైవుంటుందో అర్థం చేసుకుంది స్టెల్లా.

వాళ్ళతో మాట్లాడుతూనే అప్పుడప్పుడు అనంత్ ఆమె కళ్ళలోకి చూస్తుంటే అతడి కళ్ళలోని ఆకర్షణనించి తప్పుకోలేక కలవరపడింది స్టెల్లా.

"మిస్టర్ భారత్....మీరడిగిన దానికి నేను వెంటనే ఏమీ చెప్పలేను. నన్ను కొంచెం ఆలోచించుకోనివ్వండి. ఈ విషయం గురించి నేను మరో మనిషితో కూడా సంప్రదించాలి. అందువల్ల మీరు రేపు ఉదయం ఎనిమిది గంటలకు రండి. మీకు నా నిర్ణయాన్ని తెలియజేస్తాను."

"థాంక్ యూ....మీరు తప్పకుండా ఈ ప్రయాణానికి ఒప్పుకుంటారనే నమ్మకం నాకు వుంది. మీ నిర్ణయం మాకు సంతోషాన్నే కలగజేస్తుందని ఆశిస్తాను. రేపు ఉదయం సరిగ్గా ఎనిమిది గంటలకు ఇక్కడ వుంటాను."

అక్కడినుంచి లేచారు.

* * *

రాత్రి—పదిగంటలు దాటుతోంది.

అంతటా నిశ్శబ్దంగా వుంది. ఆ భవనంలో ఒకే ఒక్క గదిలో ఇంకా దీపాలు వెలుగుతున్నాయి.

ఆ గదిలోనే భారత్—స్టెల్లా—రంజిత్ కూర్చుని వున్నారు. వాళ్ళు టకారాదీవి యాత్రగురించే మాట్లాడు

కుంటున్నారు. ఊరికే కాదు—తాగుతూ, తింటూ మాట్లాడుకుంటున్నారు.

ఆ ముగ్గురి ఎదురుగా వున్న టేబిల్ మీద మూడు విస్కీ సీసాలు—చాలా ఖరీదైనవి—కల్తీలేని ఫారెన్ సరుకు వుంది. ఖరీదైన ఫుడ్ కూడా వుంది.

రెండో రవుండ్ కూడా పూర్తయిన తర్వాత మళ్ళీ గ్లాసుల్లోకి విస్కీని వంచింది స్టెల్లా—మిగిలిన ఇద్దరి ముందు కూడా గ్లాసులను పెట్టింది.

ఆమె కళ్ళు ఎర్రగా వున్నాయి. ఆమె కళ్ళే కాదు. మిగిలిన ఇద్దరి కళ్ళు ఎర్రగానే వున్నాయి.

స్టెల్లా చాలా ఈజీగా తమతో సమానంగా తాగుతున్నందుకు భారత్ అంతగా ఆశ్చర్యపడలేదు కానీ రంజిత్ గొప్ప ఆశ్చర్యానికి లోనయ్యాడు.

ఆమెగురించి, ఆమె ధైర్యసాహసాల గురించి—ఆమె తాగుడు గురించి కూడా రంజిత్ కు పూర్తిగా తెలీదు.

అప్పటివరకూ ఆ గదిలో గ్లాసుల్లోకి ద్రవాన్ని వంచుతున్న చప్పుడు, గ్లాసులు ఎత్తి తాగుతున్న చప్పుడు—పింగాణీ ప్లేట్ల చప్పుడు తప్పించి కొంచెంసేపటివరకు అంతా నిశ్శబ్దంగానే వుంది.

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పొగలు వగులుతున్న సిగరెట్టును యాష్ ట్రేలో నొక్కుతూ భారత్—

"ప్రొఫెసర్ అనంత్ మనతో రావటానికి అంగీకరించినట్టుగానే మనం అనుకుందాం. అప్పుడు మన మిగిలిన ఏర్పాట్లగురించి ఆలోచించుకోవాలి. మనం టకారాలతో పోరాటానికి సిద్ధపడే వెళ్ళాలి. అందువల్ల మనం అవసరమైనన్ని రివాల్వర్లు, తుపాకులు తీసుకు వెళ్ళాలి. ఒక

హెలికాప్టర్ని హైర్ కు తీసుకోవాలి. ఇంకా కొన్ని పరికరాలు తీసుకెళ్ళాలి. అన్నిటినీ మించి మంచి ధైర్య సాహసాలు కలిగిన ఓ మొరటుమనిషిని కూడా మనతో తీసుకుపోవాలి" అన్నాడు.

"మొరటు మనిషి ఎందుకు?" అడిగింది స్టెల్లా.

రంజిత్ కు ఆశ్చర్యం కలిగింది. అంతగా తాగినా ఆమె మాటల్లో ఎటువంటి తొట్రుపాటు కనిపించలేదు.

"ఒక రకంగా ఎదురుచూడకుండా ముందుకుదూకే ప్రమాదాలను ఎదుర్కోవటానికి."

"మనిద్దరం సరిపోమా భారత్."

నవ్వాడు భారత్.

"సరిపోమని కాదు. ఐనా మనకు తోడుగా ప్రాణాలకు తెగించి ప్రమాదంలోకి దూసుకుపోయే మనిషి తోడు మనకు ఆ దీవిలో ఎంతయినా అవసరం. నిజానికి టకారాల శారీరక బలం ముందు మన బలం ఎందుకూ పనికిరాదు. కేవలం శారీరక బలంతో నే తలపడవలసి వచ్చినప్పుడు మనకు అలాంటి మనిషి తప్పకుండా అవసరమవుతాడు."

స్టెల్లా మాట్లాడలేదు. అతడి మాటలు నిజమే అనిపించాయి. అవును, తమకు తోడుగా సాహసవంతుడైన ఓ మనిషి వుండటం అన్నివిధాలా మంచిది.

రంజిత్ సిగరెట్టును వెలిగించి "భారత్....నువ్వు చెప్పిన ఆ మొరటు మనిషి గురించి నాకు వదిలెయ్యి. నాకు తెలిసి అలాంటి మనిషి ఒకడున్నాడు. అతని పేరు జాన్సన్. ప్రమాదాలంటే అతనికి లక్ష్యం లేదు. చావుకు తెగించి ఎలాంటి సాహసాన్నైనా చేస్తాడు. డబ్బు కోసం ఎంతటి ఘోరాన్నయినా చెయ్యటానికి వెనుకా

డడు" అన్నాడు.

"గుడ్. అయితే రేపు ఉదయం నేను ప్రొఫెసర్ అనంత్‌ను కలిసివచ్చిన తర్వాత నువ్వు జాన్సన్‌తో మాట్లాడు. హెలికాప్టర్ హైజాక్ తీసుకునే విషయాన్ని నేను చూసుకుంటాను."

అప్పటికి భారత్—రంజిత్‌లు శక్తికిమించే తాగారు. వాళ్ళ మాటల్లో తొట్రుపాటు వస్తోంది. సైల్లా మాత్రం తాపీగా కూర్చున్నది.

వాళ్ళిద్దరి అవసనూ చూసి నవ్వుతూ "ఏమైనా ఇండియన్స్ ఎక్కువ తాగలేరు. ఆడదాన్నై వుండీ మీకంటే ఎక్కువ తాగి ఎంతో తాపీగా కూర్చున్నాను" అన్నది.

"నువ్వు ఆడదానివా?" పరిహాసంగా అడిగాడు భారత్.

"ఏం.... కాదా? ఆ అనుమానం ఎప్పుడొచ్చింది?" నవ్వుతూనే అడిగింది.

"కాదు. నువ్వు ఆడపులివి సైల్లా. నీ సాహసం అమోఘం. నువ్వు నాదానివి కావటం నా అదృష్టం. నువ్వు నాకు తోడుగా లేకుండా వున్నట్లయితే టకారా దీవినించి ఒంటరిగా నేను ప్రాణాలతో బయటపడి వుండే వాడిని కాదు. అందుకే నువ్వు నా దృష్టిలో మామూలు ఆడదానివి కాదు."

"నీకోసం ఎంతటి సాహసానికైనా సిద్ధమే భారత్. నాకు నువ్వు కావాలి. నీకోసమే నేను భారతదేశానికి వచ్చాను. నా జీవితం నీకోసమే" అన్నది సైల్లా ప్రేమగా అతడిని చూస్తూ.

"థాంక్‌యూ.... ఆ ధైర్యంతోనే ఇప్పుడు మళ్ళీ టకారాకి వెళ్ళి ఆకపాచీదేవత హారంలో వున్న మణిని

తీసుకురావటానికి ఈ సాహస యాత్రకు పూనుకుంటు న్నాను. నా జీవిత ధ్యేయం అదొక్కటే. కోట్ల విలువ చేసే ఆ మణిని మనం ఎలాగైనా సాధించి తీరాలి. అందుకు నాకు మీ ఇద్దరూ సహకరించాలి."

రంజిత్ కళ్ళు ఎక్కువగా తాగటం వల్ల మూతలు పడు తున్నాయి.

సెల్లా అన్నది: "ఇక పడుకుందాం. రంజిత్ కు నిద్ర వస్తోంది."

రంజిత్ బలవంతంగా కళ్ళు తెరుస్తూ "రేపు మాట్లాడు కుందాం.... గుడ్ నైట్" అని అక్కడినించి పక్కనే వున్న గదిలోకి వెళ్ళిపోయాడు.

ఇంకొన్ని క్షణాల తర్వాత భారత్ — సెల్లా భారత్ పడక గదిలో వెళ్ళిపోయారు.

తలుపులు మూసి లైటార్పి బెడ్ మీద పడుకున్న తర్వాత సెల్లా— భారత్ పెదవుల మీద బలంగా ముద్దు పెట్టుకుంది.

అతడు ఆమెను బలంగా తన ఛాతీకేసి అదుము కున్నాడు. ఆమె అతడిని చుట్టుకుపోయింది.

"భారత్" పిల్చింది.

"ఏమిటి?" అడిగాడు.

"నాకు ఈ క్షణాలు శాశ్వతం కావాలని వుంది. నీతో స్వర్గాన్ని, నా జీవితాన్ని అనుభవించటానికే నేను కరోన్ ను కూడా చంపి ఇక్కడకు వచ్చాను."

"ఇప్పుడేమయ్యింది సెల్లా?"

"ఎలాగో అతి కష్టం మీద చావును తప్పించుకుని ఆ టకారాల చేతుల్లోనించి తప్పించుకుని బయటపడ్డాం. కాని ఇప్పుడు నువ్వు మళ్ళీ ఆ దీవిలోని ప్రమాదాన్ని

ఆహ్వానిస్తూ వెళ్ళబోతున్నావు. ఇప్పుడు మన పరిస్థితి ఇంతకు ముందులా వుండదు. కనిపిస్తే బల్లేలతో పొడిచి చంపుతారు. ఎందుకో ఈసారి మనం టకారాలను జయించి ఆ మణితో తిరిగి రాగలమా అనిపిస్తోంది."

అదిరిపడ్డాడు భారత్ — స్టెల్లా మాటలకు. అతడికి ఫారిన్ విస్కీ మత్తంతా ఒక్కసారిగా దిగిపోయినట్లనిపించింది.

స్టెల్లాయేనా ఇలా మాట్లాడుతున్నది!

ఆశ్చర్యంగా "స్టెల్లా!" అన్నాడు.

అతడి మాటలోని ఆశ్చర్యాన్ని గమనించి నవ్వుతూ "అవును భారత్" ఎందుకో నాకు అలా అనిపిస్తోంది. ఆ దీవిలో వున్నన్ని రోజులూ అక్కడినించి బయటపడటం గురించే మనం నిరంతరం ఆలోచిస్తూ వుండిపోయాం..... ఇప్పుడు తిరిగి మళ్ళీ ఆదే దీవికి వెళ్ళబోతున్నాం.... ఈ సారి ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందో తెలీదు. ఒకవేళ మనిద్దరం ప్రాణాలతో ఆ దీవి వదలి రాలేకపోయామనుకో....అప్పుడు మనకు మిగిలేదేమిటి? శూన్యం. అందుకే అంటున్నాను. నాకు ఈ క్షణాలు నీతో శాశ్వతం కావాలి....అందుకోసం నువ్వు మరోసారి ఈ టకారాదీవి ప్రయాణం గురించి ఆలోచించు" అన్నది.

"నిజంగా నమ్మలేకుండా వున్నాను స్టెల్లా నువ్విలా మాట్లాడుతున్నావంటే. నువ్వు నాలో పిరికితనాన్ని ప్రవేశ పెడుతున్నావు. నీ ధైర్యమంతా ఏమయ్యింది? నువ్వెందుకిలా మాట్లాడుతున్నావు? ఎందుకిలా ఆ దీవికి వెళితే మనం తిరిగి రాలేమని భయపడుతున్నావు?" అనడిగాడు భారత్ లేచి కూర్చుని.

నిజంగానే స్టెల్లా మాటలతో అతడి మత్తంతా వదిలి

పోయింది.

సెల్లా పడుకునే వుంది. ఆమె కళ్ళల్లో అతడిపట్ల ఆరాధన, ఏదో అర్థింపు ఎంతో క్లియర్‌గా అతడికి కనిపించాయి.

"నేను భయపడటంలేదు భారత్...కాని శత్రువుల బలం గురించి కూడా మనం ఆలోచించాలి కదా! అంతేకాదు. మనుషుల వల్ల ఎదురయ్యే ప్రమాదాలే కాకుండా ఆ దీవిలో క్రూరమృగాలనించి కూడా మనకు ప్రమాదాలు తప్పవు. ఈ రిస్కంతా తీసుకోవటం ఎందుకు? ఆ మణికోసమే కదా! పోనీ, దాన్ని ఆ టకారాలకు వదిలెయ్యరాదా?"

భారత్‌కి ఏం మాట్లాడాలో తెలీలేదు. సెల్లాలో ఇండియాకు వచ్చిన తర్వాత అటువంటి మార్పు వస్తుందని అసలు వూహించనే లేదు.

అయితే ఆమె అంతర్యాన్ని కొంతవరకు అర్థం చేసుకోగలిగాడు. ఎంతటి ధైర్యం, సాహసం కలిగినదైనా ఆమె ఒక ఆడదే.

స్త్రీగా ఆమె హృదయంలో తనపట్ల ప్రేమ, ఆరాధన వున్నాయి. అందుకే తనకోసం ఇంతదూరం ఎన్నో కష్టాలను ఎదుర్కొనికూడా వచ్చింది.

ఎంతగా ఆత్మవిశ్వాసం, ఆయుధబలం వున్నాయనుకున్నా ఆ టకారా దీవిలో ఆ జాతివాళ్ళదే ఎప్పుడూ పైచెయ్యిగా వుంటుంది. స్థానబలం అటువంటిది. ఆ దీవిలో యే దారి ఎటు వెళుతుందో, ఏవైపుకు వెళితే ఎలాంటి ప్రమాదం ఎదురవుతుందో వాళ్ళకి బాగా తెలుసు. అలాంటి మనుషులను ఎదిరించి వాళ్ళు ఎంతో ప్రాణప్రదంగా చూసుకునే ఆ మణిని తీసుకురావాలంటే అంత సులభం కాదు. ఆ విషయం తనకీ తెలుసు. ఐనా

దానికోసం ఎంతటి సాహసానికైనా వెనుకాడకుండా ఆ దీవిలోకి తిరిగి అడుగు పెట్టాలనుకుంటున్నాడంటే ఎందుకోసం?

కోట్ల రూపాయలు విలువచేసే ఆ అపురూపమైన మణి కోసమే! ఆ మణి తన సొంతం కావాలి. అదృష్టమో— దురదృష్టమో ఆ మణి తనకు కనిపించింది. అలాంటి మణి ఆ దీవిలో వుందనే నిజం తనకీ, స్టెల్లాకే తెలుసు.

ప్రపంచంలో అరుదైన ఆ మణితో తను ప్రపంచంలో అందరికంటే గొప్పవాడై పోవాలి! తన ధ్యేయం అదే. అందుకోసం తను ఎంత సాహసాన్నయినా చెయ్యటానికి సిద్ధమే—

చివరగా అన్నాడు "సారీ స్టెల్లా....ఎంత ప్రయత్నం చేసినా, ఎంతగా ఆలోచించినా నేను నా మనసును, నా ధ్యేయాన్ని ఆ అపురూపమైన మణిమీదనించి మళ్ళించుకో లేక పోతున్నాను. ఎందుకో మనం జయిస్తామనే నమ్మకం నాకుంది. నువ్వు నాకు తోడుగా వుంటేచాలు. ఇక ఈ విషయంలో నా నిర్ణయం మారదు. దయచేసి నా నిర్ణయాన్ని మార్చే ప్రయత్నం చెయ్యకు."

స్టెల్లా ఆ తర్వాత ఏమీ మాట్లాడలేదు. ఆ మణిగురించి భారత్ ఎంత పట్టుదలతో వున్నాడో ఆమెకు బాగా అర్థమయ్యింది. ఇక తన మాటలవల్ల అతడి నిర్ణయంలో ఎలాంటి మార్పూ రాదని ఆమె నిర్ణయించుకుంది.

* * *

ఉదయం—

సరిగ్గా ఎనిమిది గంటలకు భారత్—స్టెల్లా కార్లో వెళ్ళి ప్రొఫెసర్ అనంత్‌ను కలుసుకున్నారు.

ప్రొఫెసర్ అనంత్ నవ్వుతూ వాళ్ళను ఆహ్వానిం

చాడు. అతడి పక్కనే ఓ అందమైన యువతి కూర్చుని వుంది. ఆమె కొంచెం అనూయగా చూసింది స్టెల్లాను. ఎందుకంటే ఆమె స్టెల్లా కంటే అందంగా లేదు.

ఆమెను పరిచయం చేశాడు అనంత్.

ఆమె పేరు లీల....అనంత్ ప్రియురాలు. కొద్ది రోజుల్లో వాళ్ళిద్దరూ వివాహం చేసుకోబోతున్నారు.

"మిస్టర్ భారత్ ...నిన్న నేను మరో మనిషితో మన ప్రయాణం గురించి సంప్రదించాలని చెప్పాను కదా. ఆ మనిషి ఎవరో కాదు. ఈ లీల....లీల మన ప్రయాణా నికి ఒప్పుకుంది."

"థాంక్ యూ మిస్ లీల....మీరు ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు" అన్నాడు భారత్.

"అయితే లీల ఒక షరతుమీద ఈ ప్రయాణానికి ఒప్పుకుంది. ఆ షరతు యేమిటంటే లీలకూడా మనతో టకారాదీవికి వస్తోంది."

"ఈజిట్!' ఆశ్చర్యమో, సంతోషమో తెలీకుండా అన్నాడు భారత్.

"అవును. లీల మనతో రావాలని అనుకోవటంలోని ముఖ్యమైన కారణం ఏమిటంటే ఆమె నన్ను చూడకుండా ఒక్కరోజుకూడా వుండలేదు. రెండో కారణం—ఆమెకు దీవుల పట్ల సహజంగానే కొంత ఆసక్తి వుండటం. ఇంతకు ముందు ఒకసారి నేను దీవుల గురించి పరిశోధన చేస్తున్నప్పుడు నాతో పాటు ఒక దీవికి కూడా వచ్చింది."

స్టెల్లా అన్నది: "మిగిలిన దీవుల గురించి నాకు తెలీదు కాని టకారా దీవి అనుక్షణం ప్రమాదాలతో నిండి వున్నది. అక్కడ ఎదురయ్యే నీలిరంగు పాములు చాలా

ప్రమాదకరమైనవి. ఐనా టగారా జాతి మనుషులగురించి మాకు పూర్తిగా తెలీదు. టగారాదీవికి లీల రావటం అంత మంచిది కాదని నా ఉద్దేశం."

"మీరు వస్తున్నారా?" వెంటనే కొంచెం కోపంగా అడిగింది లీల.

"నేను వెళుతున్నాను. ఎందుకంటే ఆ దీవిలో నేను కూడా ఏడురోజులు ఎన్నో ప్రమాదాలను ఎదుర్కొంటూ గడిపాను. అందువల్ల నాకు యెలాంటి భయం లేదు" అన్నది.

"మీరంతా వుంటారు కదా! ఇక నాకు భయ మెందుకు? ఏదైనా ప్రమాదం ఎదురైనప్పుడు మీరంతా వుండి నన్నొక్కదాన్ని కాపాడకుండా వుంటారా?" అన్నది లీల.

స్టెల్లా నవ్వింది.

నవ్వి "ఒక్కొక్కసారి ఎవర్నివాళ్ళు కాపాడుకోవటమే కష్టమవుతుంది. అలాంటిది మరో మనిషి ప్రాణాన్ని కాపాడే అవకాశం సహజంగా వుండదు. ఎవరిని వాళ్లు కాపాడుకునే శక్తి సామర్థ్యాలు వున్నప్పుడే ఆ దీవిలోకి రావటం మంచిది" అన్నది.

ఆ మాటలతో లీల మొహం ముడుచుకున్నది.

ఆమె మొహాన్ని చూసి బాధపడ్డాడు భారత్. స్టెల్లా మరీ అంత గట్టిగా చెప్పటం బావుండలేదేమో అనిపించింది. మనసులో భారత్ కు లీలకూడా తమతో వస్తే బావుండును అని వుంది.

"ఆల్ రైట్. మిస్ లీల అంతగా ఇంట్రస్టు చూపుతుంది కాబట్టి ఆమెకూడా మనతో వస్తుంది. ఇందుకు మాకు యెటువంటి అభ్యంతరం లేదు" అన్నాడు

భారత్.

ఆ మాటలతో సెల్లా అదోలా అతడికేసి చూసింది. అతడి కళ్ళలో ఆమెకు యెటువంటి భావమూ కనిపించ లేదు. అతడు తన మగబుద్ధిని చూపించుకున్నాడని అనుకుంది.

భారత్ అలా అనగానే లీల మొహం విప్పారింది సంతోషంతో.

"థాంక్ యూ" అన్నది నవ్వుతూ—

"సో....మన టకారా దీవి ప్రయాణం ఫిక్స్ అయినట్టే...." అన్నాడు అనంత్.

"అవును. మీ ఇద్దరికీ నేను మరోసారి కృతజ్ఞతలు చెల్లించుకుంటున్నాను" అన్నాడు భారత్.

"అవసరం లేదు....నాకూ కొంత ఇంట్రెస్టు వుంది కాబట్టి వస్తానని అన్నాను. ఇంకో రెండు నెలల్లో నేను స్టేట్స్‌కు వెళతాను. అక్కడ నా తమ్ముడు వున్నాడు.. అన్నట్టు రాత్రి మీరు వెళ్ళిన తర్వాత దీవుల గురించి నేను తయారుచేసిన నోట్సును తీసి దాన్ని రెఫర్ చేశాను. అందులో టకారా దీవి పేరు గురించిన ప్రస్తావన ఒకచోట వుంది. ఇక్కడికి రెండువేల కిలోమీటర్ల దూరంలో సాబూజా—ముంకాసా అనే దీవులు వున్నాయి. ఆ దీవులకు నేను ఒకసారి వెళ్ళినప్పుడు సాబూజా దీవిలోని ఆటవికులు కొంతమంది ఏదో మాటల సందర్భంలో అక్కడే యెక్కడో టకారా అనే దీవికూడా వున్నట్టు నాకు చెప్పారు.

అప్పుడు ఆ దీవిగురించి నేను వాళ్ళను అడిగాను. అందుకు వాళ్ళు యెప్పుడూ ఆ దీవిని చూడలేదని ఎన్నో యేళ్ళక్రితం వాళ్ళ పూర్వీకులు తమకు ఆ దీవి పేరు చెబితే

విన్నామని చెప్పారు. ఐతే సాబూజా—ముంకాసా దీవుల్లో వున్న మనుషులకు నాగరికులమీద ద్వేషం పగ అనేవి లేనేలేవు. ఎందుకంటే నాగరికులు ఎప్పుడు ఆ దీవులకు వెళ్ళినా వాళ్ళకు కావలసిన సిగరెట్లు—మత్తు పానీయాలూ తీసుకెళుతూ వుంటారు" చెప్పాడు అనంత్.

"నాగరికులకు ఆ దీవులకు వెళ్ళవలసిన అవసరం యేముంటుంది?" భారత్ అడిగాడు.

"ఆ దీవుల్లో మందులలోకి ఉపయోగించే యెన్నో రకాల దివ్యమైన ఔషధాల మొక్కలు, మూలికలు వున్నాయి.... వాటికోసం నాగరికులు అక్కడకు వెళుతూ వుంటారు."

ఇంకొంచెంసేపు వాళ్ళిద్దరూ, తమ ప్రయాణాన్ని ఎలా యెక్కడినించి మొదలుపెట్టవలసి వుంటుందో మాట్లాడు కున్నారు.

భారత్—అనంత్‌కు మెరటు మనిషి జాన్సన్ గురించి కూడా చెప్పాడు,

"గుడ్. అటువంటి మనిషి మనవెంట తప్పకుండా వుండి తీరాలి" అన్నాడు అనంత్.

తర్వాత తమతో టకారా దీవికి వస్తున్నందుకు ప్రొఫెసర్ అనంత్‌కు తను ఇవ్వదలచిన డబ్బుగురించి కూడా చెప్పేశాడు భారత్. అందుకు అనంత్ ఒప్పుకున్నాడు.

మళ్ళీ కలుస్తానని చెప్పి భారత్ లేచి నిల్చున్నాడు. సెలాకూడా నిలబడింది. వెళ్ళబోయే ముందు అనంత్ ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు. ఆమె కలవరపడింది.

"లీల మనతో రావటానికి యెందుకు ఒప్పుకున్నావు?

ఆమె అందం చూస్తూ తిరగటానికా?" తీక్షణంగా అడిగింది స్టెల్లా కారు డ్రయివ్ చేస్తూ—

"అమెరికా ఆడదానికి కూడా ఇంత అసూయ వుండటం అంత మంచిది కాదు స్టెల్లా.... నేనెందుకు ఒప్పుకున్నానో నీకు అర్థం కాలేదు. ఆమెను బ్లంట్‌గా రెఫ్యూజ్ చేశామనుకో ఆమె రావటం మానేస్తుంది. అంతే కాదు. ప్రొఫెసర్ అనంత్‌ను కూడా మనతో రానివ్వదు. ఆమె లేకుండా అనంత్ మనతో రావటానికి ఒప్పుకోడు. అందుకే లీల రావటానికి నేను ఒప్పుకోక తప్పలేదు."

"నువ్విలా చెబుతావని నాకు తెలుసు. నీ మనసులో ఏముందో నాకు తెలుసు. కొంచెం అందంగా వున్న ఆడదాన్ని చూస్తే నీ మనసు ఎగిరిపోతూ వుంటుంది. నువ్వు లీలను కళ్ళతోనే తినెయ్యటాన్ని నేను గమనించలేదనుకున్నావా? ఏమో! నువ్వెన్ని చెప్పినా లీల మనతో రావటం నాకు ఇష్టంలేదు భారత్....ఇప్పుడు బాగానే వున్నా తర్వాత ఆమె మనకు భారంగా తయారౌతుంది. మనంత చురుగ్గా ఆమె ఆ దీవిలో సంచరించగలదా? అక్కడ లీలకు ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు కారణం యెవరౌతారు? ఒప్పుకున్నందుకు నువ్వే అవుతావు" అన్నది.

భారత్ ఆమెతో ఏమీ మాట్లాడలేదు.

స్టెల్లా జెలసీ ఫీలవుతోందని అతనికి తెలిసిపోయింది. అంతే కాకుండా తన గుణం గురించి కూడా ఆమెకు బాగా తెలుసు.

ఇంటికి వెళ్ళేసరికి రంజిత్ వాళ్ళకోసమే యెదురు చూస్తున్నాడు. అనంత్ ఒప్పుకున్నాడని చెప్పాడు.

భారత్ అతనితో.

"నాకు తెలుసు ఒప్పుకుంటాడని. అందుకే జాన్సన్‌ను తీసుకువచ్చాను" అన్నాడు రంజిత్.

జాన్సన్ భయంకరంగా నాగరిక దుస్తుల్లో వున్న మొరటు మనిషిలా వున్నాడు—నున్నటి గుండుతో లావుగా — అతడి కళ్ళుకూడా భయంకరంగానే వున్నాయి గాజు గోళ్ళాల్లా—

* * *

హెలికాప్టర్ చప్పుడు చేస్తూ గాల్లోకి లేచింది భారంగా-ఆ సమయంలో భారత్ మనసుకూడా గాల్లో తేలిపోతున్నట్టుగానే అనిపించింది. అతని పక్కనే స్టెల్లా—రంజిత్—జాన్సన్—ప్రొఫెసర్ అనంత్—లీల కూర్చుని వున్నారు.

కొన్ని క్షణాల్లోనే హెలికాప్టర్ సముద్రం మీదికి వచ్చేసింది.

ఎందుకో స్టెల్లా అంత ఉత్సాహంగా వుండలేక పోయింది. ఆమె హృదయాన్ని ఏదో తెలియని ఆందోళన ఆక్రమించుకున్నది. ఎంత ఉత్సాహం తెచ్చుకుందామని అనుకున్నా సాధ్యం కాలేదు.

స్టెల్లాలో కలిగిన మార్పును భారత్ గుర్తించాడు. ఆమెకు కోట్లు విలువచేసే ఆ మణిమీద యెలాంటి వ్యామోహం లేదని పూర్తిగా తనమీదనే ఆమె మనసంతా వుందనీ అతడికి తెలుసు.

ఐనా ఆ టకారాదీవి ప్రయాణాన్ని కొనసాగించక తప్పలేదు.

సముద్రం మీద యెగురుతున్న హెలికాప్టర్‌లోనించి కిందికి చూస్తూ నవ్వుతూ ప్రొఫెసర్ అనంత్‌తో యేదో

చెబుతోంది లీల.

ఆమె మాటలు తీయగా వున్నాయి. ఆమె గొంతు ఎంతో కోమలంగా వుంది. కాని ఆమె అప్పుడప్పుడు ఆడవి జంతువులా చూస్తున్న జాన్సన్ ని చూసి భయంతో మాటలను ఆపుచేస్తోంది.

సెల్లాకు జాన్సన్ ను చూస్తే భయం కలగలేదు. ఆమె అలాంటి మనుషులను కంపూచియాలో యెంతోమందిని చూసింది. అంతేకాదు. రెండుమూడు సార్లు అటువంటి మనుషులతో పోరాటానికి తలపడి వాళ్ళను చిత్తు చేసింది. ఐనా టకారా దీవిలో ఆ జాతి ఆటవికులను చూసిన తర్వాత ఇటువంటి జాన్సన్ లను చూస్తే యేమీ అనిపించదు.

కొంచెం సేపటి తర్వాత అనంత్ వాళ్ళందరికీ దీవుల గురించి ఆ దీవుల్లో జీవించే రకరకాల జాతుల మనుషుల గురించి చెప్పటం మొదలు పెట్టాడు.

అంతా శ్రద్ధగా వింటున్నారు — ఒక్క సెల్లా తప్పించి.

ఎండలో హెలికాప్టర్ నీడ సముద్రంమీద పడుతోంది.

నిమిషాలు—గంటలు గడిచిపోయాయి.

వాచీకేసి చూసుకొన్నాడు అనంత్. "ఇంకో గంటలో మనం సాబూజా దీవిని చేరుకుంటాం" అన్నాడు.

అప్పటికే సాయంత్రమవుతోంది. ఇంకో గంటలో నే చీకటి పడేలా వుంది.

మళ్ళీ కబుర్లు మొదలైనాయి. ఈసారి సెల్లా కూడా వాళ్ళ కబుర్లలో భాగం పంచుకుంది. (సశేషం)